క్లుప్తంగా

'మేరి మట్టి-మేరా దేశ్' ర్యాలీ



మట్టితో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా హెచ్ఎం సుబహాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి మేరి మట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన మట్టితో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. మట్టి, జాతీయ నాయకుల గొప్పతనాన్ని ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయమని సిండికేట్ బ్యాంకు మేనేజర్ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిండికేట్ బ్యాంకులో హనుమేష్‌నగర్‌కు చెందిన దాదాపు 14 మెప్మా మహిళా సంఘాలకు రూ.13.7 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఉమాపతి, మెప్మా సీఎంఎం భవాని, సీఓ మధుసూదన్ రెడ్డి, ఆర్పీ సలీమా తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ మరమ్మతుల పరిశీలన

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అండర్ డ్రైనేజీ మరమ్మతును మున్సిపల్ కమిషనర్ జి.రవి బుధవారం పరిశీలించారు. పట్టణంలో ఎక్కడికక్కడ అండర్ డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోవడంతో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు బయట ప్రవహిస్తోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యుద్ధప్రాతిపదికన మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. రంగంలోకి దిగిన మున్సిపల్ అధికారులు పట్టణంలో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు లీకేజీ అవుతున్న ప్రాంతాలను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులతో పూడికతీత పనులు చేయిస్తున్నారు. ఇందులో భాగంగానే మున్సిపల్ కమిషనర్ జి.రవి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులను పరిశీలించారు. త్వరితగతిన మరమ్మతు పనులను పూర్తి చేయాలని శానిటేషన్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

సీఎం జగన్‌ను కలసిన వైఎస్సార్‌సీపీ నేత



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్ రెడ్డి

పామిడి: అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో పార్టీ స్థితిగతులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం



గుంతకల్లుటౌన్: భోజనం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మంజునాథ రెడ్డి

గుంతకల్లుటౌన్: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని బుధవారం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నదానం చేశారు. ముస్లిం మతపెద్దలు విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, వైఎస్సార్‌సీపీ యువనేత సిబి.మంజునాథరెడ్డి, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హొన్నూర్‌వలి, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహ్మద్‌బాషా, అంజుమన్ కమిటీ సభ్యులు ఆర్‌డీజీ బాషా, వలిబాషా, అఫ్రోజ్, వహాబ్, షేక్షావలి, నబీఖాన్, సీనియర్ నాయకులు గాదిలింగేశ్వరబాబు, నూర్ నిజామి పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని కర్నూలు రోడ్డులో ఉన్న మసీదులో మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

థ్యాంక్యూ సీఎం జగన్ సర్..



గుంతకల్లు: సీఎం జగన్, ఎమ్మెల్యే వైవీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బుడగ జంగాల నాయకులు



గుంతకల్లు రూరల్: మహిళలతో కలిసి సంబరాలు చేసుకుంటున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్

గుంతకల్లు: బేడ బుడగ జంగాల కులస్తులను షెడ్యూల్ క్యాస్ట్ (ఎస్సీ) జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడంతో బుధవారం బుడగ జంగాల నాయకులు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని కథలగేరిలో సీఎం జగన్, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేపట్టారు. థ్యాంక్యూ సీఎం జగన్ సర్, థ్యాంక్యూ ఎమ్మెల్యే వైవీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. బేడ బుడగ జంగం సామాజిక వర్గానికి కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తమను గుర్తించి ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చిన్నం పెద్ద వెంకటేశ్వర్లు, నాయకులు చిన్న మారెన్న, మోతి లింగన్న, పెద్ద పుల్లన్న, నాయకులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన తీర్మానంపై హర్షం

గుంతకల్లు రూరల్: బీసీ కుల గణనపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో రామస్వామి దేవాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ శరణ బసిరెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి కచ్చితమైన కుల గణన అవసరమన్నారు. బీసీ సామాజిక వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కులాల వారీగా లెక్కలు తేలితే విద్య, ఉద్యోగం, పదవులు దక్కుతాయన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి బీసీ కులానికి అందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసిన పట్టించుకోలేదన్నారు. అయితే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతగానో తోడ్పాటునందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మహిళలతో కలసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు అల్తి వెంకటేశ్వరి, జాతీయ కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు మేలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ షమీన్‌తాజ్

గుంతకల్లుటౌన్: ప్రజలందరికీ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అనే విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం తిలక్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌క్లినిక్‌ను తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేపై ఏఎన్ఎంలు, వలంటీర్లను ఆరా తీశారు. ఈనెల 30వ తేదీన పలువురు వైద్యనిపుణుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మెగా హెల్త్‌క్యాంప్ ఏర్పాట్లపై ఆస్పత్రి, మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాథమికంగా వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా మందులతో పాటు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ హెల్త్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, ఎంఈ గురప్ప యాదవ్, ఆర్ఓ నాసిర్‌హుసేన్, ఏఈ హరికృష్ణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

5న అంబేడ్కర్ నగర్‌లో హెల్త్ క్యాంప్..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 5వ తేదీన అంబేడ్కర్ నగర్, 12వ తేదీన బెంచికొట్టాల, 19వ తేదీన సత్యనారాయణ పేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌క్లినిక్ వద్ద మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్త్రీ, చిన్నపిల్లలు, జనరల్ మెడిసిన్‌తో పాటు పలువురు స్పెషలిస్ట్ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించనున్నారన్నారు. ఆయా వార్డుల్లోని ప్రజలు హెల్త్‌క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాడిపత్రి: ఈనెల 30వ తేదీ నుంచి తాడిపత్రి మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు. మెడికల్ క్యాంప్ నిర్వహించేందుకు రూరల్ పరిధిలోని ఎంఈఓ కార్యాలయాన్ని బుధవారం పరిశీలించారు. ఈనెల 30న గన్నెవారిపల్లి సచివాలయం –1 పరిధిలోని ప్రజలు ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, సచివాలయ, ఆరోగ్య, ఆశా, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ షమీన్‌తాజ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ముకుందాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ జ్వరం తదితర వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

ప్రజలు కలసికట్టుగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆర్డీఓ మధుసూదన్

పెద్దపప్పూరు: కుల, మత రాజకీయ భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉంటేనే ఏ గ్రామమైనా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పసలూరు గ్రామాన్ని ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ గంగయ్యతో కలసి సందర్శించారు. ఇటీవల వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా సుంకులమ్మ గుడి చుట్టూ వినాయకుడిని ప్రదక్షిణ చేయించాలనే విషయమై చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే.. స్థానికుల ద్వారా ఫోన్‌లో సమస్యను తెలుసుకున్నారు. బుధవారం స్వయంగా గ్రామాన్ని సందర్శించి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎటువంటి చిన్నపాటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలను పరిష్కరిస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.

పశువుల మృతిపై విచారణ



ఎల్లుట్లలో అనారోగ్యానికి గురైన పశువులను పరీక్షిస్తున్న పశువైద్యాధికారులు

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్లలో పశువులు, ఆవుల మృతిపై బుధవారం జిల్లా డివిజినల్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. స్థానిక పాడి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనారోగ్యానికి గురైన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ధాతు లోపం వల్లే పశువులు మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ధాతు లోప నివారణకు మినరల్ మిక్చర్ క్రమం తప్పకుండా వాడటంతో పాటు పరిశుభ్రమైన నీరు, దాణా అందించాలని రైతులకు సూచించారు. పాడి పశువులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఆర్బీకేలోని పశువైద్య సహాయకుడికి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నాగసువర్ణ, పశువైద్య సహాయకుడు హరీష్ పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



లబ్ధిదారుడికి పథకాలను వివరిస్తున్న యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

తాడిపత్రి అర్బన్: నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు విజయనగర్ కాలనీలో రెండో రోజూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఇంటింటికీ వెళ్లారు. అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే వచ్చి పథకాలను అందజేస్తామన్నారు. సామాన్యులకు సంక్షేమ పథకాలను అందించడమే వైఎస్ జగన్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగనాథ్‌రెడ్డి, ఆకుల చిన్ననాగిరెడ్డి, నాయకులు జావిద్, బాబా, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, ఓబులేసురెడ్డి, రామచంద్ర, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడలు



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో సీఐ నాగార్జున రెడ్డి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు 6 మండలాల నుంచి 1,100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సీఐ నాగార్జున రెడ్డి, తహసీల్దార్ రమాదేవి పాల్గొని క్రీడాకారులకు సందేశం ఇచ్చారు. అండర్–17 బాలుర విభాగంలో త్రోబాల్ విన్నర్‌గా బీకేఎస్, రన్నర్‌గా యల్లనూరు విద్యార్థులు నిలిచారు. ఖోఖోలో విన్నర్‌గా బీకేఎస్, రన్నర్‌గా నార్పల నిలిచాయి. కబడ్డీలో విన్నర్‌గా నార్పల, రన్నర్‌గా యల్లనూరు, బాల్ బాడ్మింటన్‌లో విన్నర్‌గా గార్లదిన్నె, రన్నర్‌గా నార్పల విద్యార్థులు గెలుపొందారు. అండర్–17 బాలికల విభాగంలో వాలీబాల్ విన్నర్‌గా బీకేఎస్, రన్నర్‌గా శింగనమల జట్లు నిలిచాయి. ఖోఖోలో విన్నర్‌గా పుట్లూరు, రన్నర్‌గా యల్లనూరు జట్లు నిలిచాయి. కబడ్డీలో విన్నర్‌గా యల్లనూరు, రన్నర్‌గా పుట్లూరు జట్లు నిలిచాయి. బాల్ బాడ్మింటన్ విన్నర్స్‌గా బీకేఎస్ హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీడీలు గోపాల్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నరసింహారెడ్డి, పక్కీరప్ప, మురళి తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల పరిశీలన

గుత్తి రూరల్: మండలంలోని అనగానదొడ్డి గ్రామానికి చెందిన రైతు హరి పొలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన డ్రిప్ పరికరాలు, పైపులను వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, ఉద్యాన అధికారిణి మిత్రవింద మాధవి పరిశీలించారు. ఆరు నెలల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రభుత్వం మంజూరు చేసిన 50 పైపులు, సొంత పైపులు 30, వాటర్ పిల్లర్, డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రైతు హరి ఫిర్యాదుతో నష్టం అంచనా వేసేందుకు ఏఓ, హెచ్ఓలు బుధవారం వ్యవసాయ పొలంలో కాలిన పరికరాలను పరిశీలించారు. నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఎంపీపీ విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి

బుక్కరాయసముద్రం: ప్రజలందరూ సోదరభావంతో మెలగాలని బీకేఎస్ సీఐ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచుతామన్నారు. ఆలయాలు కమిటీ వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్, ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. అనంతపురం జిల్లా స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన అండర్–19 బాక్సింగ్ పోటీల్లో నాని, కార్తిక్, రణ సూర్య, మంజునాథ, నందిష్ గౌడ్ విజయ్ సింహారెడ్డి, దివ్య నందిశ్వరీ సత్తా చాటారని పేర్కొన్నారు. అలాగే అండర్–19 ఫుట్‌బాల్ పోటీల్లో హేమలత, జీవనశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. అక్టోబర్‌లో విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, పీఈటీ వెంకటేష్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు.

సంక్షిప్త సమాచారం

అదనపు కట్నం వేధింపులపై కేసు

పెద్దవడుగూరు: తన భర్త కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన ఉమాదేవి అనే వివాహిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఉమాదేవి భర్త చౌడయ్య, అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. మహిళలను ఎవరైనా హింసిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

తాడిపత్రి అర్బన్: స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ జి.రవి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా రక్త, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీకాంత్, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

పామిడి: మండలంలోని రామరాజుపల్లి గ్రామంలో శివపార్వతయ్య ఆచారి ఇటీవల మృతి చెందారు. బుధవారం వైఎస్సార్ బీమా పథకం కింద మృతుడి భార్య భవానికి రూ.10 వేల తక్షణసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కృష్ణార్జునరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలరాజు పాల్గొన్నారు.

మద్యం విక్రేతల అరెస్ట్

గుత్తి: గుత్తి సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలోని చిత్రచేడులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు విక్రేతలను గుత్తి సెబ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సెబ్ సీఐ వరలక్ష్మి నేతృత్వంలో పోలీసులు చిత్రచేడులో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు ప్రాంతాల్లో సన్నగిరి, ఓబులేసు అనే వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

పంటల నమోదు తప్పనిసరి



కనంపల్లిలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏలు రవి, పద్మలత

గార్లదిన్నె: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని ఏడీఏలు రవి, పద్మలత పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కనంపల్లిలో చేపట్టిన ఈక్రాప్ బుకింగ్‌ను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలో అగ్రికల్చరల్, హార్టికల్చర్ పంటలు 90 శాతం ఈ–క్రాప్ బుకింగ్ చేశారన్నారు. మిగిలిన రైతులు రెండు రోజుల్లో ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

సబ్సిడీపై పప్పుశనగ విత్తనాలు

యాడికి: సబ్సిడీ పప్పుశనగ విత్తనాలకు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్వింటా పప్పుశనగ ధర రూ.8,100 అయితే సబ్సిడీ రూ.3,240 పోనూ రైతులు రూ.4,860 చెల్లించాలన్నారు. ఎకరాకు 20 కేజీల బ్యాగులు రెండు ఇస్తామన్నారు. 20 కేజీల బస్తా ధర రూ.1,620 కాగా సబ్సిడీ రూ.648 పోనూ రైతులు రూ.972 చెల్లించాలని పేర్కొన్నారు.

30న హుండీ కానుకల లెక్కింపు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఈనెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు కొండమీద వెంకట రమణ స్వామి హుండీ కానుకలు లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

వేడి నీళ్లు పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెర్నేపల్లిలో బుధవారం ఇంట్లో గ్యాస్‌పై వేడి చేసిన నీళ్ల గిన్నెను కిందకు దించుతుండగా ప్రమాదవశాత్తు కాళ్లపై పడటంతో మోహన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని హుటాహుటిన గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స చేయించారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



స్కూల్ గేమ్స్‌లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన ఎంజేపీ విద్యార్థినులు

శింగనమల: బుక్కరాయసముద్రం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో 19 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఈస్ట్ నరసాపురం ఎంజేపీ ప్రిన్సిపాల్ సంగీతకుమారి, పీఈటీ శివమ్మ తెలిపారు. అండర్–17 విభాగంలో వాలీబాల్ ఎం.మౌనిక, జే.పద్మశ్రీ, ఎం.శ్రావ్య, పీ.రూపశ్రీ, షటిల్ బ్యాట్మింటన్‌లో వి.జోష్న, ఖోఖోలో రూపశ్రీ, అండర్–14 విభాగంలో జీ.క్రాంతి, ఈ.చందన, జీ.యశ్వంతి, జీ.హారిక, కబడ్డీలో ఈ.గౌతమి, పీ.అమృత, వై.భువనేశ్వరి, ఖోఖోలో జి.మేఘన ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ అండర్–17 విభాగంలో 100 మీటర్ల పరుగులో సి.సింధూజ, ఎం.సబిత, డిస్క్‌త్రో, షాట్‌పుట్‌లో కే.భవ్యశ్రీ, జావలిన్‌త్రోలో ఎం.మౌనిక, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో సి.సింధూజ, హైజంప్‌లో కె.సంజన, అండర్–14 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో బి.నాగశ్వేత, డిస్క్‌త్రోలో జి.హారిక ఎంపికైనట్లు తెలిపారు.

తోపుడు బండి వితరణ

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురంలో నిరుపేద మహిళ లక్ష్మీదేవికి బుధవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో తోపుడు బండి వితరణ చేశారు. సెబ్ సీఐ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. లక్ష్మీదేవి కష్టాలను గమనించిన కసాపురం బలిజసంఘం సభ్యులు ముందుకు వచ్చి తోపుడు బండి అందజేయడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. విశ్వ విజ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. తమ స్కూలులో లక్ష్మీదేవి ఇద్దరు పిల్లలకు పదో తరగతి వరకూ ఉచితంగా విద్యను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కసాపురం బలిజ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో మట్కా రాస్తున్న ఇద్దరు మట్కా నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేసి, రూ.52,660 నగదు స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపిన వివరాలు.. మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పట్టణంలోని ఓంశాంతి నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న మునీర్, అతని కోడలు షేక్ నూరీ చెష్మాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.52,660 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

3న స్పాట్ అడ్మిషన్లు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీకి అక్టోబర్ 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఓఎస్‌డీ డాక్టర్ ధీరేంద్రబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాసైన విద్యార్థులు (పాలిసెట్ రాసిన, రాయని వారు) స్పాట్ అడ్మిషన్స్ ద్వారా కళాశాలలో సీటు పొందవచ్చన్నారు. కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు 80746 45615 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

త్వరలో కల్వర్టు నిర్మాణానికి చర్యలు



ఎదురూరు-అక్కజాంపల్లి గ్రామాల మధ్య కూలిన కల్వర్టును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ మురళీధర్

పామిడి: మండలంలోని ఎదురూరు–అక్కజాంపల్లి గ్రామాల మధ్య కూలిన కల్వర్టును బుధవారం పంచాయతీరాజ్ డీఈ మురళీధర్ పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గత 15 ఏళ్లుగా కల్వర్టు పునర్నిర్మాణానికి నోచుకోకపోవడంతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ డీఈ కల్వర్టును పరిశీలించారు. కల్వర్టు నిర్మాణానికి ఎస్టిమేషన్ వేశారు. త్వరలో కల్వర్టు పునర్నించి రాకపోకలను సుగమం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఇంజినీర్ హేమ్లానాయక్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.